

అడుగంటిన తాంసి మత్తడి వాగులో ఇబ్బందులు పడుతున్న పశువులు

## కొంకన్న గుట్టపై ఆదిమానవుడి ఆనవాళ్లు

బోథ్, ఏప్రిల్ 18 : బోథ్ మండలంలోని ధన్నూర్(బీ) గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలోని కొంకన్నగుట్ట వద్ద ఆది మానవుడు నివసించినట్లు ఆనవాళ్లు లభించాయి. శుక్రవారం అటవీని ప్రాంతాన్ని సిబ్బందితో కలిసి పరిశీలించే క్రమంలో రాతియుగంలో ఆదిమానవుడు వాడిన రాతి పనిముట్లు, ఆయుధాలు లభించినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణయ్ తెలిపారు. వీటిని జంతువుల వేటకు ఉపయోగించినట్లు తెలుస్తుందన్నారు.

## ఉపాధ్యాయులు సమాజాన్ని అధ్యయనం చేయాలి





మాట్లాడుతున్న ఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్

ఎదులాపురం, ఏప్రిల్ 18 : ఉపాధ్యాయులు సమాజాన్ని అధ్యయనం చేస్తూ విద్యారంగం అభివృద్ధికి పాటుపడాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాలలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన డీఎస్సీ 24 ఉపాధ్యాయుల అవగాహన తరగతులకు ఆయన బోధకుడిగా హాజరై వివిధ అంశాలపై క్లాసు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై నిరంతరం అధ్యయనం చేస్తూ ఉండాలని సూచించారు. అనంతరం సర్వీసు రూల్స్, ఉపాధ్యాయుల జాబ్‌చార్ట్ అంశాలపై అవగాహన తరగతుల్లో బోధించారు. ఈ తరగతులకు జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యకుమార్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిష్టన్న, ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షురాలు సురేఖ, జిల్లా కార్యదర్శులు స్వామి, ఇస్తారి, శివన్న, వివిధ మండలాల బాధ్యులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఖాళీ కుర్చీలతో భూభారతి సదస్సు!



ఆదిలాబాద్ జిల్లాలో పూసాయి గ్రామంలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సు జరుగుతుండగా ప్రజలు లేక ఖాళీగా కుర్చీలు

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పూసాయి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సు ప్రజలు లేక ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. ఈ కార్యక్రమానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ, పలువురు ప్రజాప్రతినిధులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మధ్యాహ్నం 2.15 గంటలకు ప్రారంభంకావాల్సిన ఈ కార్యక్రమం 3.35 గంటలకు ప్రారంభమైంది. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రసంగిస్తుండగానే సభకు హాజరైన రైతులు, మహిళలు వెళ్లిపోవడం ప్రారంభించారు. మంత్రుల ప్రసగించేటప్పుడు సదస్సులో కుర్చీలు ఖాళీగా కనిపించాయి. - ఆదిలాబాద్ ఫొటో గ్రాఫర్, ఏప్రిల్ 18

## అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

లోకేశ్వరం, ఏప్రిల్, 18 : లోకేశ్వరం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు భూమి పూజ చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కిష్టాపూర్ వాస్తవ్యులు డాక్టర్ దేవేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, మాజీ సర్పంచ్ కపిల్, పీఏసీఎస్ డైరెక్టర్లు సోమ సుధీర్ రెడ్డి, ప్రశాంత్, అంబేద్కర్ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధి కృషి



తాంసి: పూజలు చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తాంసి, ఏప్రిల్ 18: ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలో మార్కండేయ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, నాయకులు కౌడాల మహేందర్, రజినీకాంత్ రెడ్డి, కేదారేశ్వర్ రెడ్డి, గడుగు గంగన్న, మల్లయ్య, లక్ష్మీపతి, రమణ, అశోక్, కమిటీ సభ్యులు పాముల పోశెట్టి, జంగన్న, స్వామి, గంగారెడ్డి పాల్గొన్నారు.

## వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నిరసన





బోథ్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

బోథ్, ఏప్రిల్ 18: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని జామ, గుల్జార్, బిలాల్, మహమ్మదియా మసీదుల వద్ద కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ప్ల కార్డులు చేతులో పట్టుకొని నినాదాలు చేశారు. వక్ఫ్‌బోర్డు బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మౌలానా అఖిల్ అహ్మద్, మాజీదుద్దీన్, అబ్దుల్ అలీ, ఫాయిమ్, యువకులు పాల్గొన్నారు.

ఎదులాపురం, ఏప్రిల్ 18: కేంద్రం తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆదిలాబాద్‌లోని పలు మసీదుల ఎదుట ముస్లింలు ఆందోళన చేపట్టారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చేతికి నల్లా బ్యాడ్జీలు ధరించి కేంద్రం తీరును ఎండగట్టారు.

## జనావాసాల్లోకి చుక్కల దుప్పి



చుక్కల దుప్పిని అటవీ శాఖ అధికారులకు అప్పగిస్తున్న ప్రజలు

పెంబి, ఏప్రిల్ 18: చుక్కల దుప్పిని కుక్కలు తరమడంతో బెదిరిపోయి పెంబి గ్రామంలోకి వచ్చింది. స్థానిక ప్రజలు కుక్కలను తరిమి చుక్కల దుప్పిని రక్షించి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. అనంతరం అటవీ శాఖ అధికారులు దుప్పిని అడవిలో వదిలేశారు. ప్రజలకు అధికారులు అభినందనలు తెలిపారు. ఇక్కడ ఎఫ్ఎస్‌వో సుందర్, ఎఫ్‌బీవోలు కిరణ్, శ్రీనివాస్, లాలాజీ ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



కుంటాల: పెంచికల్‌పాడ్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

కుభీర్/కుంటాల/భైంసా, ఏప్రిల్ 18: కొనుగోలు కేంద్రాలకు జొన్నలు తీసుకవచ్చే రైతులకు తాగునీరు, నీడ లాంటి సౌకర్యాలు కల్పించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ నిర్వాహకులకు ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కుభీర్‌లోని మార్కెట్ కార్యాలయ ఆవరణలో, కుంటాల మండలంలోని కల్లూరు, పెంచికల్‌పాడ్, కుంటాల, అంబకంటి, ఓల, లింబా (కే) గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో, భైంసాలోని వ్యవసాయ మార్కెట్ నందు మార్క్‌ఫెడ్ టీఎస్ఈఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రేకుల గంగాచరణ్, భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనందరావ్ పటేల్, ఏఎంసీ కార్యదర్శి గంగన్న, పీఏసీఎస్ కార్యదర్శి ఎగ్గం క్రాంతి కుమార్, మాజీ మండలాధ్యక్షుడు విఠల్, కుంటాల పీఏసీఎస్ చైర్మన్ గజ్జరాం, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



దస్తురాబాద్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

దస్తురాబాద్/ఖానాపూర్/ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 18: నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని బుట్టాపూర్, రేవోజీపేట గ్రామాల్లో, ఖానాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో, ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఖానాపూర్ పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషన్, వైస్ చైర్మన్ మజీత్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజురా సత్యం, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వినతి

ఎదులాపురం,ఏప్రిల్ 18 : ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మున్సిపాల్టీని కార్పొరేషన్ ఏర్పాటు చేసి కార్మికులకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రదేవేందర్ అన్నారు. శుక్రవారం జిల్లాలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పర్యటన నేపథ్యంలో ఏఐటీయూసీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ,డ్రైవర్స్ యూనియన్ మున్సిపల్ టెక్నీషియన్స్ ఆధ్వర్యంలో ముందస్తుగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం, కార్మికులు చనిపోతే మట్టి ఖర్చులకు రూ.30వేలు, కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఎమ్మెల్యే ద్వారా మంత్రులకు వినతిపత్రం అందజేయాలన్నారు. నాయకులు కాంతారావు, మెరుగు చిరంజీవి, నారాయణ రెడ్డి, నగేశ్, అగ్గిమల్ల స్వామి ఉన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ఇచ్చోడ, ఏప్రిల్ 18: రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే) గ్రామంలో పాడి పశువులు, ఎడ్లకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది చంద్రశేఖర్, దేవరావ్, రైతులు పాల్గొన్నారు.

నేరడిగొండ, ఏప్రిల్ 18 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని బుద్దికొండ, రాజురా గ్రామాల్లోని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వీఎల్‌వో వెంకన్న, వీఏ అరుణ్, సిబ్బంది సురేశ్ పాల్గొన్నారు.

ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 18: ఖానాపూర్ మండలంలోని ఏక్బాల్‌పూర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం ఇన్‌చార్జి పశు వైద్యధికారి పడిగెల సౌందర్య ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో జేవీవో రాజేశ్వర్, సిబ్బంది రమణ గౌడ్, నర్సయ్య పాల్గొన్నారు.

## యాపచెట్టు కాడ ఊరు మీది ముచ్చట్లు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆదర్శ రైతు సట్వాజీ, కవి, గ్రామస్తులు

తాంసి, ఏప్రిల్ 18 : ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ ఉదారి నారాయణ రచించిన యాప చెట్టు కాడ ఊరు మీది ముచ్చట్లు పుస్తకాన్ని తాంసి మండలంలోని ఈదుల్లసావర్గాంకు చెందిన ఆదర్శ రైతు సట్వాజీ ఆవిష్కరించారు. రైతు సట్వజీ తన జొన్న చేనులో పని చేస్తూ ఉండగా రచయిత ఉదారి నారాయణ, తనమిత్రులు గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ సామల వీరన్న, తెలుగు భాష ఉపాధ్యాయులు గంగన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు డాక్టర్ గంగయన, బీదన్, రాములు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ మొగిలి

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 18: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ మొగిలి అన్నారు. గురువారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని ముసల్‌పాడ్, తాండ్ర గ్రామాల్లో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు పోలీసు మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైన తమకు తెలియని నంబర్ల నుంచి ఫోన్ చేసినప్పుడు వివరాలు తెలుపకూడదని అన్నారు. అదేవిధంగా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు తమకు సమాచారం ఇస్తే పరిష్కరిస్తామని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగన్న, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


# భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

ఎదులాపురం/బోథ్/ ఇచ్చోడ/ నేరడిగొండ/ ఉట్నూర్/ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి, ఏప్రిల్ 18: ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలకు పెద్దసంఖ్యలో హాజరై ఏసుక్రీస్తు సిలువ మీద పలికిన ఏడు మాటలను ధ్యానించారు. పలువురు పాస్టర్లు సందేశాన్నిచ్చారు. బైబిల్ పఠనాలు, ప్రార్థన గీతాలు ఆలపించి జీసస్‌పై భక్తిని ప్రకటించుకున్నారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నేరడిగొండలోని చర్చిలో నిర్వహించిన గుడ్ ఫ్రైడే వేడుకల్లో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.



నేరడిగొండ: చర్చిలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





లింబా(కే)లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001–02 పదో తరగతి బ్యాచ్

కుంటాల, ఏప్రిల్ 18 : నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని లింబా(కే) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02 పదో తరగతి విద్యార్థులు శుక్రవారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు జనార్దన్, రాందాస్, వెంకట్, శకుంతల, రాజారామ్, శంకర్ పాల్గొన్నారు.

## పగుళ్ల భవనాన్ని ప్రారంభించని మంత్రి

### కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం



ప్రారంభానికి ముందే గోడకు పగుళ్లు తేలిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్

తాంసి, ఏప్రిల్ 18: ఆదిలాబాద్ జిల్లా తాంసిలో శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యటన చివరి నిమిషంలో రద్దు కావడంతో మండల వాసులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.20 లక్షలతో నిర్మించిన పగుళ్ల భవనాన్ని (ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సబ్ సెంటర్)ను ప్రారంభించలేదని, తాంసి చెరువు మరమ్మతులు, మండలానికి ప్రత్యేక బస్సు, డిగ్రీ కళాశాల, తాగునీటి సమస్యలపై వినతి పత్రాలు రాసి మంత్రి పర్యటన రద్దు కావడంతో చేసేదేమి లేక చెత్తబుట్టలో వినతి పత్రాలు పడేశామని వాపోయారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్ కార్యవర్గం

భైంసా, ఏప్రిల్ 18 : శ్రీ సరస్వతి శిశు మందిర్ కిసాన్‌గల్లీ నూతన కమిటీ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుంట కాశీనాథ్, ఉపాధ్యక్షుడిగా కాండ్లి సాయినాథ్, కార్యదర్శిగా బాజనోల్ల రవి, సహ కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా తూమోల్ల దత్తాత్రి, సభ్యులుగా శ్రీకాంత్, శ్రీనివాస్, సాయినాథ్ పటేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రధానాచార్యులు నామాల భోజన్న ఒక ప్రకటనలో తెలిపారు.

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

దిలావర్‌పూర్, ఏప్రిల్ 18 : ఉపాధి హామీ పనులు చేసే ప్రదేశంలో కూలీలు వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిలావర్‌పూర్ ఆరోగ్య కేంద్రం సీఎచ్‌వో రాజేశ్వర్ సూచించారు. శుక్రవారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో చేపడుతున్న ఉపాధి హామీ పనుల ప్రదేశంలో కూలీలకు వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

భైంసా, ఏప్రిల్ 18 : నిర్మల్ జిల్లా భైంసాలోని పెట్రోల్ బంక్, కృప గ్యాస్ ఏజెన్సీలలో శనివారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి రవి, సిబ్బంది శ్రీనివాస్, సాయికిరణ్, గజ్జారాం పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుంటాల, ఏప్రిల్ 18 : నిర్మల్ జిల్లా కుంటాలతో పాటు మండలంలోని కల్లూరు, గొల్లమాడ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారి వీ మధు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

## అమ్మాయిని వేధించిన యువకుడి రిమాండ్





పోలీసులు అరెస్ట్ చేసిన అలీమ్ బేగ్

బోథ్, ఏప్రిల్ 18: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన ఓ అమ్మాయిని సోషల్ మీడియా ద్వారా వేధించిన నిజామాబాద్ జిల్లా రేంజల్ మండలం కందకుర్తి గ్రామానికి చెందిన అలీమ్ బేగ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం బోథ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ వివరాలు వెల్లడించారు. అలీమ్ బేగ్ కొంత కాలంగా ఓ అమ్మాయిని సోషల్ మీడియా ద్వారా వేధిస్తున్నాడు. అమ్మాయి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పర్చినట్లు పేర్కొన్నారు. అలీమ్ బేగ్‌పై నిజామాబాద్ జిల్లా రేంజల్ పోలీస్ స్టేషన్‌లో ఇది వరకు నాలుగు కేసులతో పాటు రౌడీషీట్ ఓపెన్ అయినట్లు తెలిపారు. 2023 సంవత్సరంలో డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో 17 మోటర్ సైకిళ్ల దొంగతనంలో సైతం నిందితుడు పట్టుబడినట్లు పేర్కొన్నారు. అప్పట్లో మోటర్ సైకిళ్లను రికవరీ చేశారని తెలిపారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

ఖానాపూర్ టౌన్, ఏప్రిల్ 18: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని శాంతినగర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్‌లోని శాంతినగర్ కాలనీకి చెందిన బాలేకర్ మహేశ్(32) పట్టణానికి చెందిన వివాహితను ప్రేమిస్తున్నాడు. అట్టి విషయంలో తీవ్ర మనస్థాపం చెందిన యువకుడు గురువారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి గంగేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రయాణికులకు పుష్పం అందిస్తున్న డీఎం

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 18 : ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రవేశపెట్టిన పథకాలు, సేవలు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ ఆర్టీసీ డీఎం కే పండరి అన్నారు. ప్రతినెల మూడో శుక్రవారం ప్రయాణికుల మర్యాద దినోత్సవం సందర్భంగా నిర్మల్ బస్టాండ్‌లో ప్రతి బస్సులోకి ఎక్కి గులాబీ పువ్వులు, కీ చైన్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ప్రయాణికులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. టికెట్ బుకింగ్, ఆర్టీసీ బస్సులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలన్న సమాచారం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్ నవీన్‌కుమార్, స్టేషన్ మేనేజర్ ఏఆర్ రెడ్డి, వీజీ రెడ్డి, కంట్రోలర్లు, కండక్టర్, డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో ఉత్తమ స్థానంలో పెంబి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 18: ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన నిర్మల్ జిల్లా పెంబి బ్లాక్ జాతీయ స్థాయిలో 4వ ర్యాంక్, జోన్ స్థాయిలో 2 స్థానంలో నిలిచినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద పెంబి బ్లాక్ అక్టోబర్ నుంచి డిసెంబర్ 2024 త్రైమాసికానికి మొత్తం 500 బ్లాక్‌లలో ర్యాంకింగ్‌లోజాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంక్ రావడంతో పెంబి బ్లాక్ అభివృద్ధికి రూ.కోటి అవార్డు కూడా సాధించిందన్నారు. ఇది ఎంతో గర్వించదగిన విషయమన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, పోషకారం, సామాజిక అభివృద్ధి వంటి కీలక రంగాలతో సహా 40 రంగాల పని తీరు సూచికల ఆధారంగా ఈ ర్యాంకింగ్ సాధ్యమైనట్లు తెలిపారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, జిల్లా అధికారులు కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం, ఏప్రిల్ 18: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఔట్ సోర్సింగ్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీను, ప్రధాన కార్యదర్శి అగ్గిమల్ల స్వామి కోరారు. జిల్లా పర్యటలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి కార్పొరేషన్ ద్వారానే వేతనాలు చెల్లించాలన్నారు. అదే విధంగా మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవలు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లూరి రవి, రాష్ట్ర ఔట్ సోర్సింగ్ జేఏసీ ఉపాధ్యక్షుడు రామగిరి సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు గుమ్ముల నరేశ్, సంతోష్, సతీశ్, ఇమ్రాన్, కోశాధికారి గోపాల్, సతీశ్, సారయ్య, సంఘర్ష్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

## 29న ఇందిరాపార్క్ ఎదుట పెన్షనర్ల ధర్నా

ఎదులాపురం, ఏప్రిల్ 18 : రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈ నెల 29వ తేదీన హైదరాబాద్ ఇందిరా పార్క్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆదిలాబాద్ శాఖ అధ్యక్షుడు ఎస్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని, పీఆర్సీ రిపోర్ట్ తెప్పించుకొని అమలు చేయాలని వృద్ధులైన పెన్షనర్స్‌కు అన్ని దవాఖానల్లో హెల్త్ కార్డులు వర్తింపజేయాలని, ఉద్యోగ విరమణ పొందిన వారి ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని, పెన్షనర్స్ అందరినీ ఇన్‌కమ్ టాక్స్ నుంచి మినహాయించాలన్నారు. మొదలైన అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడానికి ఈ నెల 29న ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేయాలని నిశ్చయించారన్నారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో పెన్షనర్స్ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



లక్ష్మణచాంద: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

లక్ష్మణచాంద/సోన్/సారంగాపూర్, ఏప్రిల్ 18: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని పీచర గ్రామంలో, సోన్‌లోని ఐకేపీ ఆధ్వర్యంలో, సారంగాపూర్ మండలంలోని ఆలూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సారంగాపూర్ మార్కెట్‌యార్డు, కౌట్ల(బీ)లో, నిర్మల్‌లో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.